# సినీతార (ఆత్మ) హత్య!

## వాణిశ్రీ

ఆ రోజు శుక్రవారం.

తూర్పు దిక్కున అరుణోదయానికి ప్రకృతి రంగాన్ని సిద్ధం చేస్తోంది.

ప్రఖ్యాత సినీతార సిరిదేవి భవనం ముందు టూరిస్టు బస్ ఆగింది. అంతా తిరుపతి నుంచి వచ్చారేమో బోడి గుండులు తళతళ మెరుస్తున్నాయి.

అంతా మెయిన్ గేటు ముందు గుమిగూడారు.

'వీళ్ళకేం పనిపాటా లేనట్లుంది. తెల్లవారక ముందే వచ్చి పడ్డారు' అని గొణుక్కొంటూ వచ్చాడు వాచ్‌మాన్.

"అమ్మగారు ఇంకా నిద్ర లేవలేదు" అన్నాడు.

"లేచేదాకా వేచి వుంటాం" అన్నారు జనం.

వాచ్‌మాన్ అయిష్టంగా గేటు తాళం తీశాడు. టూరిస్టులు సిరిదేవి భవనం ఆవరణలో లాన్స్‌మీద జట్లు జట్లుగా కూర్చున్నారు.

సిరిదేవి దర్శనంకోసం ఎదురు తెన్నులు చూస్తున్నారు అభిమానులు.

సిరిదేవికి బెడ్ కాఫీ త్రాగే అలవాటులేదు. అలాగే సూర్యోదయానికి ముందే నిద్ర లేచే అలవాటు కూడా లేదు. ఆమె యెప్పుడు నిద్ర లేస్తే అప్పుడామె గది తలుపులు తెరుచుకుంటాయి. అప్పుడామె దినచర్య ప్రారంభమవుతుంది. ఆమె నిద్ర లేచిన వేళనుబట్టి ప్రోగ్రాం నిర్ణయిస్తాడు ఆమె సెక్రెట్రీ పవన్ కుమార్.

ఏడింటికి స్కూటర్ మీద వచ్చాడు పవన్ కుమార్.

ఆఫీస్ రూమ్‌లో ఏ. సి. ఆన్ చేసి కూర్చున్నాడు ఫైల్స్ ముందేసుకుని. నిన్న వచ్చిన టపాలో ముఖ్యమైన లెటర్స్‌కి జవాబులు టైప్ చేసి సిరిదేవి సంతకానికి సిద్ధంగా వుంచాడు. పత్రికలలో ఆమె నటించిన చిత్రాలలోని స్టిల్స్, ఇతర వార్తలను రెడ్ పెన్సిల్‌తో మార్కు చేసి రెడీ చేశాడు.

ఎనిమిది దాటింది.

ఇంకా సిరిదేవి నిద్ర లేవలేదు.

బైట అభిమానుల్లో కలకలం చెలరేగింది.

ఆమె నిద్రలేచి వుంటుందనీ, ఇంకా దర్శనం ఇవ్వడం లేదనీ వాళ్ళు అనుమానించారు.

కొందరు కుర్రాళ్ళు "సిరిదేవి బైటకు రావాలి" అని కేకలు పెట్టసాగారు.

వాచ్‌మాన్ వాళ్ళతో ఘర్షణ పడుతున్నాడు.

సెక్రెట్రీ పవన్ కుమార్ వెళ్ళి ఆమె ఇంకా నిద్ర లేవలేదనీ, రాత్రి షూటింగ్‌లో చాలా ప్రొద్దుపోయిందనీ, అందుకే ఆమె ఈ పూట నిద్ర లేవడం ఆలస్యమైతుందనీ నచ్చజెప్పాడు. అంతా భోజనంవేళకు వస్తే తప్పకుండా

చూడ వచ్చునీ, ఫొటోలు గూడా తీసుకో వచ్చునీ అన్నాడు.

"ఆ వేళప్పుడు ఇంట్లో యెందుకుంటుంది? ఏ స్టూడియో లోనో వుంటుంది" అన్నారు యెవరో.

"లేదయ్యా! సిటీలో వుంటే ఆమె భోజనానికి ఇంటికే వస్తుంది" అన్నాడు సెక్రెట్రీ.

"ఇంత దూరం వచ్చాం. ఆమె లేచేదాకా ఇక్కడే వుంటాం" అన్నారు.

"సరే మీ యిష్టం" అని విసురుగా వెళ్ళిపోయాడు పవన్ కుమార్.

తొమ్మిది కావచ్చింది.

ఫోన్ కాల్స్ రావడం మొదలయ్యాయి. ఆమె ఇంకా నిద్ర లేవలేదని సమాధానం చెప్పలేక విసుగు పుట్టింది అతనికి.

అతని మనసులో అనుమానం మొలకెత్తింది. 'ఆమె ఇంకా నిద్ర లేవకపోవడం యేమిటి?'

ఆమె రాత్రి పదిన్నరకి ఇల్లు చేరుకుంది. తను వెంటనే వెళ్ళిపోయాడు. ఆ తర్వాత భోజనం చేసి ఒక అరగంటలో పడుకొని వుంటుంది. అది ఆమెకు మామూలే. సామాన్యంగా ఆమె ఏడింటికల్లా నిద్ర లేస్తుంది. ఎప్పుడో సెకండ్ షో సినిమాకి వెళ్ళినప్పుడు కొంత ఆలస్యంగా లేస్తుంది.

'తొమ్మిదింటి వరకూ లేవక పోవడానికి కారణం యేమిటి?'

'గది తలుపు తట్టి ఆమెను నిద్ర లేపితే?' అనుకొన్నాడు.

'కాని ఆమెకు కోపం వస్తుందేమో?' అని అనుమానం

వచ్చింది.

వంటమనిషి కమలమ్మని పిలిపించాడు.

"రాత్రి అమ్మగారు ఎన్ని గంటలకు పడుకొన్నారు?" అని ప్రశ్నించాడు పవన్ కుమార్.

"భోజనం చేసి పడుకొన్నారు. టైమ్ చూళ్ళేదు" అంది కమలమ్మ.

"నేను వెళ్ళిన వెంటనే భోజనం చేశారా?"

"ఆఁ...."

"వెంటనే నిద్ర పోయారా?"

"నేను గమనించలేదు. భోజనం చేసి బెడ్ రూమ్‌కి వెళ్ళిపోయారు."

"అమ్మగారు ఇంకా నిద్ర లేవలేదు. రాత్రి పొద్దు పోయేవరకూ మేలుకొని వున్నారేమో నని అడిగాను."

"అదే నేనూ అనుకొంటున్నాను. టిఫిన్ పెసరట్లు చెయ్యమన్నారు. అమ్మగారు నిద్ర లేస్తారేమో నని చూస్తున్నాను. ఈ పూట వంట యేం చెయ్యమంటారో? వంట ఆలస్యమవుతుందేమో నని నా బాధ" అంది కమలమ్మ.

"సరే నేను తలుపు తట్టి చూస్తాను" అన్నాడు పవన్ కుమార్.

"చూడండి" అంది కమలమ్మ.

అతను మెల్లెక్కి మేడపైకి వెళ్ళాడు.

నెమ్మదిగా తలుపులు తట్టాడు.

రెస్పాన్స్ రాలేదు.

గట్టిగా తట్టాడు.

ఊహూఁ....లాభం లేకపోయింది.

అతని గుండె వేగంగా కొట్టుకొంది.

ఎంత కొట్టినా లోపల నుంచి సమాధానం రావడం లేదు.

'కొంతతీసి....' అనుమానం వచ్చింది.

అతనికి ముచ్చెమటలు పోశాయి.

పరిగెత్తుకొంటూ ఆఫీసు గదిలోకి వచ్చి పడ్డాడు. అతని కంగారు చూసి నౌకర్లు వచ్చారు హడావుడిగా.

టెలిఫోన్ డైరక్టరీలో పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ వెతికి ఫోన్ చేశాడు.

"పోలీస్ కంట్రోల్ రూమ్ ప్లీజ్" అని సమాధానం వచ్చింది.

"సార్.... నేను సినీ ఆర్టిస్టు సిరివేవి సెక్రెటరీని మాట్లాడుతున్నాను."

"వాట్ డూ యూ వాంట్ ప్లీజ్?"

పవన్ కుమార్ జరిగిందంతా చెప్పాడు. తనకి అనుమానంగా వుందని వెంటనే పోలీసుల్ని రమ్మని రిక్వెస్టు చేశాడు.

ఎలాగో ఈ వార్త లాన్స్‌లో కూర్చున్న అభిమానులకు చేరింది. అంతా గుంపులుగా పోర్టికోలోకి వచ్చి నిల్చున్నారు. నౌకర్లని ప్రశ్నలతో వేధిస్తున్నారు.

కాసేపటికి పోలీస్ వ్యాన్ వచ్చింది.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథం, సబ్ ఇన్‌స్పెక్టర్ డానియేల్ వ్యాన్ దిగారు. వాళ్ళ వెనుక కానిస్టేబుల్సు దిగి జనాన్ని అదుపులో పెట్టసాగారు.

పవన్ కుమార్ ఎదురు వచ్చి వాళ్ళని మేడ పైకి తీసుకెళ్ళాడు.

ఆ గది తలుపులు టేక్ వుడ్‌తో చేసినవి. ద్వార బంధం గూడా చాలా స్ట్రాంగ్ గా వుంది. రకరకాల డిజైన్స్ చెక్కి కళాత్మకంగా మలిచారు దాన్ని.

విశ్వనాథం గట్టిగా నెట్టి చూశాడు.

"నో డౌట్ ఇటీజ్ ఏ సూసైడ్ కేస్" అన్నాడు పెదవి విరిచి.

తల వూపాడు ఎస్.ఐ. గది లోపల లాక్ చేసి వుంది. డూప్లికేట్ కీ లేదన్నాడు సెక్రెట్రీ.

ఎయిర్ కండిషన్ చేయబడినది కాబట్టి కిటికీ లన్నీ మూసే వున్నాయి. ఏ. సి. ఆన్ చేసే వున్నట్లు శబ్దం వస్తోంది.

"బ్రేక్ చెయ్యాల్సిందే!" అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్.

ఎస్. ఐ. ఆ ఏర్పాట్లు చేశాడు.

లోపల బోల్టు లాక్ వూడిపడి భళ్ళున తెరుచుకొంది తలుపు.

విశ్వనాథం గదిలోకి రెండడుగులు వేసి నిలబడి పోయాడు. గదంతా పరికించి చూశాడు.

గది యెంతో విశాలంగా వుంది. కిటికీ లన్నింటికీ మిల మిల మెరుస్తున్న కర్టెన్స్ వున్నాయి. గది మధ్యలో డబుల్ కాట్ మీద నైట్ గౌనులో నిద్రపోతున్నట్లుగా వుంది సిరిదేవి.

ఆమె కళ్ళు మూసుకొని వున్నాయి. ఇంకా నిద్ర పోతూనే వుందా అనే భ్రాంతి కలిగిస్తోంది.

విశ్వనాథం అనుమానంతో దగ్గరగా వెళ్ళి చూశాడు. సందేహంలేదు ఆమె శ్వాస ఆగిపోయి వుంది.

"షీ డైడ్!" అన్నాడు గట్టిగా.

# 2

సినీతార సిరిదేవి ఆత్మహత్య చేసుకుందనే వార్త దావానలంలా నగరంలో నలు మూలలా వ్యాపించి పోయింది.

జనం తండోపతండాలుగా ఆమె నివాస గృహానికి రాసాగారు. వాళ్ళని అదుపులో పెట్టడం పోలీసులకు పెద్ద సమస్యగా తయారైంది.

సినిమా పరిశ్రమకు చెందిన ప్రముఖ నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, స్టూడియో అధిపతులు, పత్రికా ప్రతినిధులు ఆమె ఇంటికి ప్రవాహంలా రాసాగారు.

ఆమెతో చిత్రాలు తీస్తున్న ప్రొడ్యూసర్లు ఏడుపు ముఖం పెట్టి మిత్రులతో తమ గతి యేమిటా? అని వాపోతున్నారు.

ఐ. జీ., నగర పోలీస్ కమీషనర్, వగైరా పెద్ద పోలీస్ ఆఫీసర్లు కూడా హుటాహుటిన సిరిదేవి ఇంటికి చేరుకొన్నారు.

శవ పంచాయితీ జరిపి శవాన్ని పోస్టుమార్టమ్‌కి పంపే సరికి మిట్టమధ్యాహ్నం దాటిపోయింది.

ఎఫ్.ఐ.ఆర్. తయారుచేస్తూ సిరిదేవి ఇంటిదగ్గరే వుండి పోయాడు ఇన్‌స్పెక్టర్ విశ్వనాధం.

పవన్‌కుమార్ అతని యెదురుగా కూర్చున్నాడు దిగులుగా.

"అయితే సిరిదేవికి దగ్గర బంధువులు సిటీలో ఎవరూ లేరన్నమాట" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

లేరన్నట్లు తల వూపాడు పవన్‌కుమార్.

"పోనీ యే వూళ్ళో వున్నారో చెప్పగలరా?"

"ఆమె స్వగ్రామం తూర్పుగోదావరి జిల్లాలో యేదో

పల్లెటూరు. నాకు సరిగా తెలియదు. అప్పుడప్పుడూ ఒక ముసలమ్మ, పిల్లలు వస్తూ వుండేవాళ్ళు. సిరిదేవికి మేన త్తను కుంటాను. కాని ఆమె వాళ్ళని సరిగా చూసేది కాదు. వాళ్ళ పట్ల చాలా నిర్లక్ష్యంగా ప్రవర్తించేది. సూటి పోటి మాటలతో గాయపరిచేది. వాళ్ళు బాధపడి వెళ్ళి పోయేవారు."

"ఆమె అలా ప్రవర్తించడానికి ఏదో కారణం వుండే వుంటుంది."

"అలాగే అనుకొనేవాడిని నేను కూడా. ఆమె దిక్కు లేని పరిస్థితిలో వున్నప్పుడు బంధువు లెవరూ ఆదుకో లేదని ఆమె అంటూ వుండేది. ఆమె స్వశక్తితో ఒక ఉన్నత స్థానంలోకి వచ్చింది. ఇప్పుడు బంధువులు దగ్గరగా రావాలని ప్రయత్నించినా ఆమె రానివ్వ లేదు."

"ఆమె వయస్సు ఎంత వుండొచ్చు షుమారుగా!"

"ముప్ఫై వరకూ వుంటాయి."

"మీరు యెంత కాలం నుంచి సెక్రటరీగా పని చేస్తు న్నారు?"

"మూడేళ్ళ నుంచి."

"అంతకు ముందు యెవరు పని చేశారు?"

"సుగుణాకరరావు."

"ఎందుకు మానేశాడు?"

"నాకు సరిగా తెలియదు. బ్లాక్ మనీ విషయంలో ఆమెను మోసం చేశాడని చూచాయగా తెలిసింది. నేను పట్టించుకోలేదు ఆ విషయం."

"అతను యిప్పుడు యెక్కడ వున్నాడో మీకు తెలుసా?"

"తెలియదు. వాళ్ళ వూరు వెళ్ళి యేదో ఇండస్ట్రి స్టార్ట్ చేశాడని ఎవరో చెప్పగా విన్నాను" అన్నాడు పవన్ కుమార్.

"సిరిదేవి టాలెంట్ వున్న ఆర్టిస్టు. దేశంలో సాటి లేని మేటి నటి అనిపించుకొంది. తరగని సంపద సంపాదించింది. ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితులు యేమి వున్నాయో మీ రేమైనా చెప్పగలరా?" ప్రశ్నించాడు ఇన్ స్పెక్టర్.

పవన్ కుమార్ తల వంచుకొని కళ్ళు మూసుకున్నాడు బాధగా.

"అదే ఇన్ స్పెక్టర్ నాకు అర్థం కాని విషయం. ఆ ప్రశ్నకు సమాధానం నేను చెప్పలేను" అన్నాడు.

"ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకోవాలంటే ఎంతో విరక్తి కలిగితే కాని సాధ్యం కాదు."

తల వూపాడు పవన్ కుమార్.

"ఆమె మానసికమైన బాధతో ప్రవర్తించినట్లు మీకు గుర్తుందా?"

"లేదు సార్! ఆమె ప్రతిరోజూ యెంతో సంతోషంగా కన్పించేది."

"నిన్న గూడా అలాగే వుందా!"

"అవును సార్. నిన్న వుదయం ఏడింటికి వచ్చాను నేను. అప్పటికే ఆమె నిద్రలేచింది. నేను గుడ్ మార్నింగ్ చెప్పాను. ఆమె నవ్వుతూ గుడ్ మార్నింగ్ చెప్పింది. ఆ రోజు కార్యక్రమం ఆమె ముందు వుంచాను. అది చూసి వెరీగుడ్ అంది. తర్వాత బ్రేక్ ఫాస్టు చేసి స్టూడియోకి వెళ్ళిపోయారు."

"తర్వాత మళ్ళీ మీరు ఆమెను చూడలేదా?"

"లంచ్‌కి యింటికి వచ్చి వెళ్ళినప్పుడు చూశాను. కాని నేనప్పుడు ఆఫీస్‌రూమ్‌లో వున్నాను. యేదైనా పని వుంటే పిలిపిస్తారు. లేదా తనే ఆఫీస్‌రూమ్‌లోకి వస్తారు."

"ఐ. సీ....మరి రాత్రి...."

"నేను పదిన్నర వరకూ వుండి వెళ్ళిపోయాను. తర్వాత డిన్నర్ చేసి పడుకొన్నారని కమలమ్మ చెప్పింది."

"కమలమ్మ ఎవరు?"

"వంటమనిషి."

"ఆమె ఇక్కడే వుందా?"

"ఉంది సార్!"

"పిలిపించండి."

పవన్‌కుమార్ బజర్ నొక్కాడు.

కాసేపటికి కాకీ బట్టలు తొడుక్కొన్న కుర్రాడు వచ్చాడు.

"కమలమ్మను పిలువు."

కమలమ్మ ఏడుస్తూ వచ్చింది. ఇన్‌స్పెక్టర్ ఆమెను రకరకాల ప్రశ్నలు అడిగాడు. ఇంట్లో నౌకర్లందర్నీ ప్రశ్నించాడు.

ఎవరు చెప్పినా సిరిదేవి చాల మంచిదనీ, దేవతలాంటి మనిషనీ కష్టకాలంలో ఆదుకొంటుందనీ చెప్తున్నారు. కాని ఆమె పర్సనల్ విషయాలు చెప్పడంలేదు. బహుశా యెవరికీ తెలియనంత కట్టుదిట్టంగా ప్రవర్తిస్తుందన్న మాట.

"మిస్టర్ పవన్‌కుమార్ ఆమెకు ముప్పై సంవత్సరాలు వచ్చాయిగదా ఇంకా పెళ్ళి చేసుకోకుండా వుండడానికి

కారణం యేమిటి?"

"లోగడ చేసుకొన్న వివాహం భగ్నమవడమే అందుకు కారణం అనుకొంటాను."

"ఏమిటీ? ఆమెకు లోగడ పెళ్ళయిందా?...." ఆశ్చర్యపోతూ ప్రశ్నించాడు ఇన్ స్పెక్టర్ విశ్వనాథం.

"అవును సార్! మీకు తెలియదా! ఈ సంగతి అందరికీ తెలిసిందే."

"ఆఫ్ కోర్స్. నేను యిలాంటివి పట్టించుకోను. సినిమా మాగ్జయిన్స్ ఆసలే చూడను. మరి నా కెలా తెలుస్తుంది. అయితే ఆమె మొదటిభర్త సారీ మాజీభర్త ఎవరు?"

"నందకుమార్."

"నందకుమార్! ఆ పేరు ఎక్కడో విన్నట్టుందే."

"వినే వుండడం కాదు, చూసే వుంటారు. అతనూ నటుడే."

"యస్! యిప్పుడు అంతగా రావడం లేదనుకొంటాను...."

"ఆయనకి డిమాండ్ లేదు."

"ఎందుకని?"

"క్యారెక్టర్ మంచిది కాదు. త్రాగుడు ఎక్కువై పోయింది. సాటి నటులతోనే అసభ్యంగా ప్రవర్తిస్తుంటాడు. తను గొప్ప నటుణ్ణి అని అహంభావం యెక్కువ. కాల్షీట్స్ యిచ్చి అనుకోకుండా యెటో వెళ్ళిపోతుంటాడు. అదీగాక వయస్సు వచ్చి పడింది లెండి. ఏభై యేళ్ళు దాటాయి. ఫీల్డులోకి కుర్రాళ్ళు వచ్చారు."

"అయితే సిరిదేవికి అతనికి ఇరవై యేళ్ళు తేడా వుందన్నమాట."

"ఉంది."

"అంత తేడా వున్నప్పుడు యెలా పెళ్ళాడింది?"

పవన్ కుమార్ నవ్వాడు.

"మనమేం చెప్పగలం సార్!" అన్నాడు.

"నిజమే. మనకి పెద్ద సమస్యగా కనిపించిన విషయం కొందరికి అసలు సమస్యగానే తోచక పోవచ్చు" అన్నాడు ఇన్స్పెక్టర్.

"ఏ పరిస్థితిలో పెళ్ళి జరిగిందో గాని మొత్తానికి యెక్కువ రోజులు కాపురం చెయ్యలేదు. ఒక్క సంవత్సరం చేశారేమో! తర్వాత డైవోర్స్ యిచ్చుకొన్నారు."

"ఎవరు? అతనా?"

"ఈమే ఇచ్చింది."

"పెళ్ళి జరిగి యెంతకాలం అయ్యింది?"

"ఐదు సంవత్సరాలు దాటింది."

"డైవర్స్ యిచ్చి నాలుగేళ్ళయిందన్నమాట."

"అంతే. నేను జేరినప్పటికి ఆమె వొంటరిగానే వుంటోంది."

"మరిప్పుడు ఈమె ఆస్తికి వారసు లెవరు?"

పవన్ కుమార్ పెదవి విరిచాడు.

"తెలియదు సార్!" అన్నాడు.

"పోస్టుమార్టమ్ రిపోర్టు తీసుకొని, కమీషనర్ గారిని కలుసుకోవాలి. వస్తాను. థాంక్స్!" అన్నాడు ఇన్స్పెక్టర్ విశ్వనాథం సీట్లోంచి లేచి.

## 3

పోలీస్ కమీషనర్ చాంబర్లో క్రైమ్ బ్రాంచ్ పోలీస్ ఆఫీసర్లతోపాటు ఇన్స్పెక్టర్ విశ్వనాథం

కూర్చుని వున్నాడు.

పోస్టుమార్టమ్ రిపోర్టు, కెమికల్ ఎగ్జామినర్ రిపోర్టు చూస్తూ కూర్చున్నాడు.

"ఇటీజ్ వెరీ సర్‌ప్రైజింగ్ థింగ్!" అన్నాడు కమీషనర్.

"ఎస్సార్" అన్నాడు ఇన్‌స్పెక్టర్ విశ్వనాథం.

పోలీస్ కమీషనర్ ఆలోచనలో పడిపోయాడు.

"సిరిదేవి ఆత్మహత్య చేసుకోవడానికి కారణం యేమిటో అంతుబట్టడంలేదు సార్. ఆమె రిలెటివ్స్‌తో దగ్గర సంబంధాలు లేవు. నందకుమార్ భర్త. కాని డైవర్స్ ఇచ్చింది."

"నందకుమార్ పరిస్థితి బాగాలేదనీ, ఇప్పుడు ఇన్కమ్ యేమీ లేదని తెలిసింది. అతన్ని మనం సస్పెక్ట్ చెయ్యవచ్చునా?" ప్రశ్నించాడు కమీషనర్.

"అంటే నందకుమార్ ఆమెను మర్డర్ చేయించాడని మీరు అనుమానిస్తున్నారా? అందువల్ల అతనికి లాభం యేమిటి? డైవర్స్ ఇచ్చిన తర్వాత ఆస్థి అతనికి వస్తుందా? లీగల్ పాయింట్" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"సిరిదేవి ఆస్థికి వారసులు ఎవరు?" ఎవరో ఆఫీసర్ ప్రశ్నించాడు.

"అదే తేలడం లేదు."

"ఆమె రక్తసంబంధీకులు ఎవరూ లేరా?"

"లేరు. ఆమెకు వయసు వచ్చేసరికి తల్లిదండ్రులు పోయారు. తర్వాత నాటకాల్లో వేషాలు వేస్తూ బ్రతికేది. కొంత కాలానికి సినిమారంగంలో ప్రవేశించి గొప్ప నటిగా పేరు ప్రతిష్టలు సంపాదించింది."

"ఇందులో ఏదో మిస్టరీ వుందని నాకు అనుమానంగా

వుంది. సిరిదేవికి ఆత్మహత్య చేసుకోవలసిన దారుణమైన పరిస్థితులు ఏమీ లేవు. ఆమె చనిపోతే ఆస్తి వచ్చే వారసులూ లేరు. అంటే ఆమెను హత్య చేస్తే లాభం పొందేవాళ్ళు లేరు. కాబట్టి ఆమె ఆత్మహత్య చేసుకొని వుండాలి. లేదా ఆమె ఆస్తికోసం కాకుండా కేవలం ఆమెమీద పగతో విష ప్రయోగం చేయించి వుండాలి" అన్నాడు క్రైమ్‌బ్రాంచి ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

అంతా ఆలోచనలో పడిపోయారు.

"మిస్టర్ కృష్ణమూర్తీ ఈ కేసు మీరు టేకప్ చేసి ఇన్వెస్టిగేట్ చెయ్యగలరా?"

కృష్ణమూర్తి సందేహంగా చూశాడు విశ్వనాథం వైపు.

అతను నవ్వి—"నేను సెలవులో వెళ్తున్నాను" అన్నాడు.

"ఐతే నేను రెడీ...." నవ్వుతూ అన్నాడు కృష్ణమూర్తి.

"మిస్టర్ విశ్వనాథం కేస్ డైరీ మూర్తికి ఇవ్వండి" అన్నాడు కమీషనర్.

కృష్ణమూర్తి సీట్లోంచి లేచి వెళ్ళి కమీషనర్ ముందున్న కెమికల్ ఎగ్జామినర్ రిపోర్టు తీసుకొన్నాడు.

## 4

"మిస్టర్ పవన్‌కుమార్ సిరిదేవి షుమారు పదేళ్ళనుంచీ హీరోయిన్‌గా నటిస్తున్నదనుకొంటాను!" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

"అవును సార్!"

"ఆమె దాదాపు వంద చిత్రాల్లో నటించింది కదూ!...."

"అవును."

"ఆమె పిక్చర్‌కి యెంత రెమ్యూనరేషన్ తీసుకునేదో మీకు తెలుసనుకొంటాను."

"అది ఆమె యిష్టప్రకారం జరిగేది. నిర్మాతనిబట్టి, కథనిబట్టి అంటే ఆ చిత్రం బడ్జెట్‌నిబట్టి, చిత్రం తీసే భాషనిబట్టి ఆమె తన రెమ్యూనరేషన్ తీసుకొనేది."

"మీరు వచ్చిన దగ్గర్నుంచి నటించిన చిత్రాలకు దేనికి ఎంత తీసుకుందో మీరు చెప్పగలరా?"

"షుమారుగా చెప్పగలను."

"ఆ వివరాలు తియ్యండి."

పవన్‌కుమార్ ఐరన్ బీరువాలోనుంచి ఫైలు తీశాడు. వైట్ పేపర్‌మీద చిత్రం పేరు అందుకు తీసుకొన్న రెమ్యూనరేషన్ వేసి టోటల్ ఫిగర్ వేశాడు.

అది చూసి కృష్ణమూర్తి నవ్వాడు.

"ఇవి ఇన్కమ్‌టాక్స్ వాళ్ళకి ఇచ్చే వివరాలు. నాకు కావలసింది అవి కాదు."

"మరి."

"మిష్టర్ పవన్‌కుమార్ సిరిదేవి పిక్చర్‌కి మూడు లక్షలు తీసుకుంటుందని నాకు తెలుసు. కాని ఆమె ఇచ్చిన రసీదులు పాతిక వేలు, ముఫ్పై వేలకి వున్నాయి."

"అవన్నీ నాకేం తెలుసు?"

"మీకు అన్నీ తెలుసు. బ్లాక్‌మని వ్యవహారాలన్నీ మీ చేతిమీదుగా జరిగేవని కొందరు ప్రొడ్యూసర్స్ మాకు చెప్పారు. నా అంచనా ప్రకారం కనీసం పాతిక లక్షలు బ్లాక్‌మనీ వుండాలి సిరిదేవి వద్ద. కాని ఆమె బ్యాంక్ ఖాతాలలో ఫిక్సెడ్ డిపాజిట్స్, కరెంట్ ఎక్కౌంట్స్ అన్నీ కలిసి రెండు లక్షలు కూడా లేదు."

కృష్ణమూర్తి మాటలు విని తడబడ్డాడు పవన్ కుమార్.

"డబ్బంతా నేను ఆమెకే ఇచ్చేవాడిని."

"ఇచ్చివుంటారు. కాదని నేను అనడం లేదు. కాని ఆ డబ్బంతా ఆమె యేంచేసిందో తెలిసివుండాలి మీకు?"

"నాకు తెలియదు."

"మీకు ఆమె జీతం యెంత ఇచ్చేవారు?"

"నెలకు వెయ్యి రూపాయలు."

"నెలకు వెయ్యి. మీరు మూడేళ్ళు పని చేశారు. మొత్తం ముప్పైఆరువేలు జీతం క్రింద ముట్టింది మీకు. కాని మీ పిల్లల పేరున మీ పేరున ఏభైవేలకు ఫిక్స్‌డ్ డిపాజిట్స్ వున్నాయి బ్యాంక్‌లో. లక్ష రూపాయలు విలువచేసే పొలం కొన్నారు మీ నేటివ్ ప్లేస్‌లో. నగరంలో యిల్లు కట్టిస్తున్నారు. యివన్నీ జీతంలోనే...." నవ్వాడు కృష్ణమూర్తి.

"జీతంకాక అప్పుడప్పుడూ ఆమె కొంత డబ్బు బోనస్‌గా ఇస్తూ వుండేవారు."

"అవన్నీ నిజమే కావచ్చు. కాని ఆమె బ్లాక్‌మనీ అంతా మీకు తెలిసివుండే చోట వుంది. బంగారం రూపంలోగాని, డబ్బు రూపంలోగాని వుంది. మీకు తెలుసు. నిజం చెప్పండి" కృష్ణమూర్తి గొంతు కరుకుగా వుంది.

"అంటే—మీరు నన్ను అనుమానిస్తున్నారా?"

"అవును."

"ఆమె ఆత్మహత్య చేసుకోవడానికి నేను కారణం అంటారా?"

"యూ ఆర్ రాంగ్ మిష్టర్ పవన్‌కుమార్. ఆమె

ఆత్మహత్య చేసుకోలేదు. హత్య చేయబడింది. యెవరో విషప్రయోగం చేశారు."

అదిరిపడ్డాడు పవన్‌కుమార్. అతని ముఖం వెలా వెలా పోయింది. ఏ.సి. రూమ్‌లోగూడా అతనికి చెమటపట్టింది. శరీరంలో సన్నగా వణుకు ప్రారంభమైంది.

"ఈజిట్ కరెక్ట్?"

"ఎస్. కెమికల్ ఎగ్జామినర్ రిపోర్టులో తేలింది ఆ విషయం. గురువారం రాత్రి ఆమె మద్యం త్రాగింది. తర్వాత డిన్నర్‌లో చికెన్ తీసుకొంది ఆమె. ఈ రెండు స్టేజస్‌లో యెప్పుడో విషం కలిసింది. అందువల్ల ప్రాణం పోయింది" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

"ఓ మైగాడ్!" అంటూ తలను చేత్తో పట్టుకొని కూర్చుండిపోయాడు పవన్‌కుమార్.

"ఇప్పుడు చెప్పండి. ఆమె బ్లాక్‌మనీ గురించి."

"సార్! నన్ను బాధపెట్టకండి. నాకు ఏమీ తెలియదు ఆ డబ్బు గురించి."

"నేను నమ్మను. ఆమెను మర్డర్ చెయ్యడానికి మీకే యెక్కువ అవకాశమున్నట్లు నేను అనుమానిస్తున్నాను. ఆమె బ్లాక్‌మనీ మీ చేతిలో వుంది. బహుశా ఏ అజ్ఞాత వ్యక్తి పేరునో బ్యాంక్ లాకర్స్‌లో అదంతా వుండి వుండొచ్చు. సిరిదేవిని హత్య చేస్తే ఆమె ఆస్థి రాక పోయినా బ్యాంక్ లాకర్స్‌లో వున్న బ్లాక్‌మనీ దక్కించుకోవచ్చునని మీరే చేసివుండొచ్చు."

"నో...." అంటూ గట్టిగా అరిచాడు పవన్‌కుమార్.

## 5

నెహ్రూ రోడ్డులో బస్ స్టేజిలో దిగాడు కృష్ణమూర్తి. ఇంటి నెం. 9, నెహ్రూ రోడ్డు దామోదరం

పిళ్లై స్ట్రీట్ కోసం వెతకసాగాడు.

సెవ్రాలెట్ కార్ లో కొంతదూరం నడిచాక కుడిప్రక్క సందులో దామోదరపిళ్లై స్ట్రీట్ అని బోర్డు కనిపించింది.

నాలుగు ఇళ్ళు దాటాక 9వ నెంబర్ భవనం ముందు ఆగాడు. గేటు ప్రక్కన పూలమొక్కలకి పాదులు త్రవ్వుతున్నాడు తోటమాలి.

ప్రహరీగోడకి తెల్లటి పాలరాతి మీద అరుణాచలం, అనే అక్షరాలు చెక్కిన పలక వుంది.

కృష్ణమూర్తిని చూసి తోటమాలి తను చేస్తున్న పని ఆపి వచ్చాడు.

"అయ్యగారు వున్నారా?"

"ఉన్నారు" అంటూ గేటు తీశాడు.

అరుణాచలం ఒంటరిగానే కూర్చుని వున్నాడు గదిలో.

"గుడ్ మార్నింగ్!" అంటూ విష్ చేశాడు కృష్ణమూర్తి.

అరుణాచలం తల పైకెత్తి ప్రశ్నార్థకంగా చూశాడు కృష్ణమూర్తిని. అతని కళ్ళు ఎర్రగా నిప్పుముద్దల్లా వున్నాయి. టేబుల్ మీద రమ్ము బాటిల్ వుంది. గ్లాసులో సగానికి ఎర్రటి ద్రవం వుంది. టేబుల్ మీద ప్లేటులో జీడిపప్పు, చిప్స్ వున్నాయి.

'ప్రొద్దున్నే మొదలుపెట్టాడు మానవుడు' అని గొణుక్కున్నాడు కృష్ణమూర్తి.

"మీరెవరో గుర్తుపట్టలేదు, ఐయామ్ సారీ!" అన్నాడు అరుణాచలం.

"నన్ను మీరు చూసి వుండరు లెండి. నా పేరు

కృష్ణమూర్తి. క్రైమ్‌బ్రాంచి ఇన్‌స్పెక్టర్ని. సిరిదేవి కేసు యిన్వెస్టిగేట్ చేస్తున్నాను" అంటూ ఐడెంటిటీ చూపించాడు.

"నిల్చునే వున్నారేం? కూర్చోండి ప్లీజ్!" అన్నాడు అరుణాచలం.

కృష్ణమూర్తి గదంతా పరీక్షగా చూడసాగాడు.

అరుణాచలం రెండో గ్లాసులో రమ్మువోసి సోడా పోశాడు.

"ప్లీజ్ టేకిట్" అన్నాడు.

"నో థాంక్స్. అలవాటు లేదు" అన్నాడు కృష్ణమూర్తి నవ్వుతూ.

అరుణాచలం బలవంతం చెయ్యలేదు. కాలింగ్ బెల్ నొక్కి కుర్రాడిని పిలిచి గోల్డ్ స్పాట్ తెప్పించాడు.

"సిరిదేవి గురువారం మీ పిక్చర్ షూటింగ్‌లో ఆమె జీవితంలో ఆఖరిసారి నటించిందనుకొంటాను" అన్నాడు కృష్ణమూర్తి స్ట్రాతో డ్రింక్ తీసుకొంటూ.

"ఆ క్రెడిట్ మాత్రం దక్కింది నాకు" పేలవంగా నవ్వాడు అరుణాచలం.

"ఆమె హఠాత్తుగా పోవడం మీకు చాలా లాస్ అనుకొంటాను."

"లాస్ అని నెమ్మదిగా అంటారేమిటి సార్! కొంపలు ముంచేసిందనుకోండి. నా పిక్చర్ మధ్యలో వుంది. పూర్తిగా తగలపెట్టాల్సిందే. నాలాంటివాళ్ళు పదిమంది వున్నారు. అంతా పిచ్చిపట్టినట్లు తిరుగుతున్నారు యేం చెయ్యాలో తోచక" సిరిదేవి చనిపోయినందుకు అతను యే మాత్రం బాధను వ్యక్తం చెయ్యలేదు. తనకి నష్టం

జరిగినందుకు మాత్రం విచారిస్తున్నాడు.

కృష్ణమూర్తి తల వూపాడు.

"సూసైడ్ చేసుకోదల్చుకున్నప్పుడు మా పిక్చర్స్ పూర్తిచెయ్యాల్సింది. ఆవిడ అవన్నీ ఆలోచించలేదు. మధ్యలో మమ్మల్ని బికార్లను చేసి వదిలింది" నిష్ఠూరంగా అన్నాడు అరుణాచలం.

"ఆమె సూసైడ్ చేసుకుందని అందరూ అనుకుంటు న్నారు. కాని అది కరెక్టు కాదు."

"మరి?...." ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

"ఎవరో ఆమెను మర్డర్ చేశారు."

తన ముందు బాంబ్ ప్రేలినట్లు అదిరిపడ్డాడు అరుణా చలం.

"నిజమా సార్?"

"నిజమే. ఆ విషయమే ఇన్వెస్టిగేట్ చేస్తున్నాను. ఆమెను మర్డర్ చేసింది ఎవరో కూడా కనిపెట్టితీరతాను" పట్టుదలగా అన్నాడు కృష్ణమూర్తి.

"అలాగా సార్! మేమంతా సిరిదేవిని తప్పుగా అర్థం చేసుకొన్నాం సార్! నిజానికి ఆమె చాలా మంచిది. ప్రొడ్యూసర్స్‌ని ఇబ్బంది పెట్టే నైజం లేదు. మా కష్ట సుఖాలు ఆలోచించి ప్రవర్తించేది. తను పెద్ద స్టార్‌నని గర్వం లేనిది" అరుణాచలం సిరిదేవిని పొగడసాగాడు.

"మీరు మాకు సహకరిస్తే హంతకుడిని పట్టుకొనడం చాలా సులభం అవుతుంది."

"డెఫెనెట్లీ సార్! అడగండి. మీకు కావలసిన విష యాలు నాకు తెలిసినవన్నీ చెప్తాను" అన్నాడు అరుణా చలం.

"మీరిప్పుడు మంచి మూడ్‌లో లేరేమో? మరొక

సారి వస్తాను" అన్నాడు కృష్ణమూర్తి.

"నో....నో....డ్రింక్ గురించా మీరు మూడ్ అంటున్నారు. ఫరవాలేదు. నాకు మామూలే! ఈ సీసా మొత్తం లాగించినా నాకేం కాదు. అలవాటు. ఇది లేకపోతేనే మూడ్ లేనట్లు" నవ్వాడు అరుణాచలం.

"గురువారం రాత్రి సిరీదేవి విస్కీ తీసుకుంది. సామాన్యంగా ఒంటరిగా విస్కీ తీసుకునే అలవాటు ఏ కొద్ది మందికో వుంటుంది. అదీగాక ఆమె ఒంటరిగా తీసుకోదలిస్తే ఇంట్లోనే తీసుకోవచ్చునుగదా! ఎక్కడో తీసుకోవలసిన అవసరం ఏముంది?"

"నిజమే! కాని గురువారం సాయంకాలం ఆరింటికే ఆమె స్టూడియో నుంచి వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఎక్కడికి వెళ్ళిందీ, యెవరితో డ్రింక్ తీసుకుందీ నాకు తెలియదు."

"ఆమె ఏ కారులో వెళ్ళింది?"

"స్వంత కారులోనే. తనే డ్రైవ్ చేసుకుని వెళ్ళింది. ఆమెకు డ్రైవర్ వున్నాడు. కాని అతన్ని పగలు మాత్రమే వాడుకుంటుంది. లంచ్‌కి యింటికి వెళ్ళి వచ్చిన తర్వాత అతన్ని పంపేస్తుంది. షూటింగ్ పూర్తయ్యాక తనే కారు డ్రైవ్ చేసుకొని వెళ్తుంది."

"ఐ. సీ!...." అన్నాడు కృష్ణమూర్తి యేదో ఆలోచిస్తూ.

"ఆమె హాట్ డ్రింక్స్ తీసుకుంటుందని నాకు తెలుసు. కాని అందరి ముందూ తీసుకోదు. ఇంపార్టెంట్ ఫ్రెండ్స్‌తో తీసుకుంటుంది."

"అలాగా! ఎవరోగాని చాలా తెలివిగా ఆమెను హత్యచేసి ఆత్మహత్యగా నిరూపించాలని ప్రయత్నిం

చారు. ఆ డ్రింక్‌లోనే స్లీపింగ్స్ పిల్స్ పొడిచేసి కలిపి తాగించారు. అందువల్ల ఆమె నిద్రలోనే మరణించింది."

"ఎవడో ఆ దుర్మార్గుడు!"

"మీ కిప్పుడు ఎవరిమీదనైనా అనుమానం కలుగుతోందా?" ప్రశ్నించాడు కృష్ణమూర్తి.

"అర్థం కావడంలేదు" అన్నాడు అరుణాచలం.

"ఆమె క్లోజ్‌గా మూవ్ అయ్యే స్నేహితులు తెలుసా మీకు?"

"చాలామందితో అంటే ఆర్టిస్టులతో మూవ్ అవుతూ వుంటుంది. ఇదొక విచిత్రలోకం. ఎవరు ఎవరితో క్లోజ్‌గా వుంటున్నారో తెలియదు."

"పోనీ ఆమె చనిపోతే లాభపడేవాళ్ళు ఎవరైనా వున్నారా?"

"ఎవరుంటారు? ఎవరో వారసులు వుండాలి ఆస్తికోసం...."

"నో.... నా వుద్దేశ్యం అదికాదు. ఆమె వుండడంవల్ల తమకు ఛాన్స్‌లు రావడంలేదని, ఆమె తమకు అడ్డుగా వుందని ఫీలయ్యేవారు...."

"భలేవారు సార్! ఆమె పోయినందున ఒక్కరికీ లాభం కలుగదు. ఎందరో అప్ కమింగ్ ఆర్టిస్టులు లాభం పొందవచ్చు. అలా అడ్డుగా ఫీలై మర్డర్స్ మొదలుపెడితే ఈ పరిశ్రమకు మనుగడే లేదు. అల్లకల్లోలమై పోతుంది. అలా జరిగివుండదని నా వుద్దేశ్యం" అన్నాడు అరుణాచలం.

"పోనీ ఆమె మీద ఎవరికైనా పగ వుందేమో తెలుసా మీకు?"

"నో....ఆమె మీద పగ వుండాల్సింది ఎవరికి? అందరికీ అనుకూలంగా ప్రవర్తిస్తుంది ఆమె."

"ఆమె భర్త గురించి చెప్పగలరా ఏమైనా?"

"అతను డైవర్సు ఇచ్చాడు గదా! ఆమె ఆస్థి గూడా రాదు అతనికి. మరి ఇంకే లాభం ఆశించి ఇంత దారుణానికి పూనుకుంటాడు?"

కృష్ణమూర్తి తల వూపాడు.

"థాంక్స్ అరుణాచలంగారూ! మీరు ఈ విషయం మనసులో పెట్టుకోండి. ఏదైనా మీకు సమాచారం తెలిస్తే మాకు వుపయోగపడుతుంది అనుకుంటే తెలియ జెయ్యండి. ఇది నా టెలిఫోన్ నెంబర్" అంటూ ఒక కార్డు ఇచ్చాడు కృష్ణమూర్తి.

"అలాగే!" అన్నాడు అరుణాచలం.

కృష్ణమూర్తి సెలవు తీసుకుని బయల్దేరాడు.

# 6

భార్య మరణం గుర్తొచ్చి కాబోలు నందకుమార్ కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు.

"సారీ! మిమ్మల్ని బాధ పెట్టినట్టున్నాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

నందకుమార్ కళ్ళు తుడుచుకొని "ఫరవాలేదు. ఆమె నా నుంచి దూరమైనా యింకా ప్రేమిస్తూనే వున్నాను" అన్నాడు.

"మీ వివాహం ఎక్కువ కాలం నిలవకపోవడానికి కారణం ఏమిటి? అభ్యంతరం లేకపోతే చెప్పండి" అన్నాడు కృష్ణమూర్తి.

"అభ్యంతరం ఎందుకూ? అందరికీ తెలిసిన విషయమే. ఒక ఒరలో రెండు కత్తులు ఇమడవు అంటారు. మా విష

యంలో అది నిజమైంది."

"అఫ్ కోర్స్. నాకు మీ సమస్య అర్థమైంది లెండి...."

"నిజం చెప్పాలంటే కళాకారుల మనస్సులు చాలా సున్నితంగా వుంటాయి. మరొకరితో అడ్జెస్టు కావడం కష్టమని నాకు అనుభవం ద్వారా తెలిసింది. అందుకే ఏ గొడవలూ తలెత్తకముందే ఆమె విడిపోతానని అనగానే అంగీకరించాను."

"ఆమె ఆత్మహత్య చేసుకుందని లోకం నమ్మేటట్లు హత్య జరిగిందని నేను అనుమానిస్తున్నాను. అందుకే ఈ కేసు కావాలని ఇన్వెస్టిగేట్ చేస్తున్నాను."

"మీరు అలా అనుమానించడానికి యేదైనా ఆధారం వుందా?"

"వుంది."

నందకుమార్ ఆసక్తిగా చూశాడు కృష్ణమూర్తిని.

"కాని కాదేమిటో యిప్పుడు బైటపెట్టలేను. మీకు ఆమె ఆత్మహత్య చేసుకొనే వుద్దేశ్యంలో లేదని తెలుసుకొనేందుకు యిది చాలనుకొంటాను" అంటూ టీపాయ్ మీద వున్న ఒక సినీ వారపత్రిక తీసి నందకుమార్ కి అందించాడు.

"ఆమె చనిపోవడానికి జెస్టు రెండురోజుల క్రితమే అర్జునరాజు అనే సినీ జర్నలిస్టు ఇంటర్వ్యూ చేశారు. ఆ ఇంటర్వ్యూలో ఆమె అభిప్రాయాలు చదవండి. రాబోయే రెండు మూడు సంవత్సరాలలో తను చిత్రనిర్మాణం, దర్శకత్వం చేపట్టాలనుకుంటున్నానని తెలియజేసింది.

సరిగ్గా రెండు రోజులలోనే ఆమె అభిప్రాయాలు

మార్చుకుని జీవితాన్ని అంతం చేసుకోవాలనే నిర్ణయానికి రావడానికి కారణం ఏమిటి? ఏదైనా ఆమె భరించలేనంత ఘోరం జరిగిందా? ఆమె జీవితంలో ఏదైనా పరాజయం అదీ రెండురోజుల్లో పొందిందా? అంటే యేమీ లేదు. ఏమీ జరగలేదు. నేను ఖచ్చితంగా చెప్పగలను ఇది ఆత్మహత్య కాదని."

నందగోపాల్ రెండు చేతులతోను ముఖాన్ని కప్పుకున్నాడు కాసేపు.

"నాకంతా అయోమయంగా వుంది!" అన్నాడు బాధగా.

"నన్నొక సందేహం పీడిస్తోంది. ఆమె మీ నుండి విడిపోయి నాలుగేళ్ళు దాటిపోయాయి కదా! అప్పటికామె మంచి వయస్సులోనే వుంది. మళ్ళీ వివాహం చేసుకోవడానికి ఎందుకు ప్రయత్నించలేదు!"

"ఆమెకొక అనుమానం వుంది మగవాళ్ళ విషయంలో. ఆమె దగ్గరగా రావడానికి ప్రయత్నించే వాళ్ళంతా ఆమెమీద ప్రేమతో కాక డబ్బుకోసం అనుకుంటూ వుంటుంది. అందరూ డబ్బు మనుషులే అని ఆమె అభిప్రాయం. తనను మనస్ఫూర్తిగా ఆరాధించే వాళ్ళు లేరు. ఎవరైనా డబ్బుకోసమే తనను ప్రేమిస్తారు అని నిర్ణయించుకొంది. అందుకే మళ్ళీ పెళ్ళి సంగతి యెత్తలేదేమో?"

"నిజమే కావచ్చు. డబ్బున్న వాళ్ళెవారూ ఆమెను వివాహం చేసుకోవడానికి ప్రయత్నించలేదా?"

"ఆ సంగతి మీరు తెలుసుకోవాలి" పేలవంగా నవ్వాడు నందకుమార్.

"ఈ కేసులో సిరిదేవి సెక్రెటరీని అరెస్టు చెయ్యమంటావేమిటి? నాకు అర్థం కావడంలేదు నీ ఉద్దేశ్యం. అతనే చేశాడంటావా?" ప్రశ్నించాడు పోలీస్ కమీషనర్.

"నో....నో....అతను చెయ్యలేదు. కాని చేసిందెవరో అతనికి తెలుసు. పోనీ తెలియకపోయినా చెయ్యడానికి ఎవరికి వీలుందో అతనికి తెలుసు. మనం అనుకున్నంత అమాయకుడు కాదు అతను. అరెస్టుచేసి చూడండి తెలుస్తుంది"! అన్నాడు ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి.

"సరే కానివ్వు!" అంటూ రిసీవర్ ఎత్తి పవన్ కుమార్ని వెంటనే అరెస్టు చేసి తీసుకొని రమ్మని చెప్పాడు.

అరగంట తర్వాత ఫోన్ వచ్చింది. పవన్ కుమార్ సిటీలో లేడు. ఎక్కడికి వెళ్ళాడో యింట్లో వాళ్ళకి తెలియదట.

"చూశారా! వాడు ఎస్కేపయ్యాడు."

"ఎంతకాలం? ఇంటికి రాకుండా ఎక్కడికి పోతాడు? ఎప్పుడూ ఇద్దరు కానిస్టేబుల్స్ని మఫ్టీలో వుంచితే సరి దొరక్కపోడు."

"అంతదాకా ఎందుకు? వాడు ఎక్కడికిపోయాడో నాకు తెలుసు?" అన్నాడు కృష్ణమూర్తి.

ఆశ్చర్యంగా చూశాడు కమీషనర్.

"ఇదుగో ఈ ఫోటో చూడండి" అంటూ కార్డుసైజు ఫోటో ఒకటి అందించాడు కృష్ణమూర్తి.

అందులో పదేళ్ళ పాప కాన్వెంట్ డ్రెస్‌లో

నవ్వుతూ వుంది.

"ఎవరు ఈ పాప?"

"సిరిదేవి కూతురు."

పోలీస్ కమీషనర్ వులిక్కిపడ్డాడు.

"ఈజిట్ కరెక్టు?" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

"ఎస్సార్?"

"ఎలా తెలుసుకున్నావు? సిరిదేవి బ్యాంక్ ఖాతాలు చెక్ చేశాను. ప్రతి నెలా ఫస్టు తారీఖున బెంగుళూరులోని లిటిల్ ఫ్లవర్ కాన్వెంట్ కి వెయ్యి రూపాయలు చెక్ పంపుతూ వుండడం గమనించాను. సిరిదేవి రూమ్‌లో ఆమె డైరీలో దొరికిన ఈ ఫోటో యెవరిదో అర్థమైంది. ఆ ఫోటో వెనుక సంతకం చూడండి. రజని అని వుంది. అంటే ఆ పాప పేరు రజని."

"ఆ పాప సిరిదేవి కూతురే అని యెలా చెప్పగలవు? యెవర్నయినా బంధువుల పిల్లని పెంచుకొంటూ వుందేమో...."

"నేను బెంగుళూరు వెళ్ళి ఇన్వెస్టిగేట్ చేశాను."

"మొత్తానికి అసాధ్యుడవే!...." మెచ్చుకోలుగా అన్నాడు.

"ఆరేళ్ళ క్రితం సిరిదేవి స్వయంగా ఆ పాపను కాన్వెంట్‌లో చేర్పించింది. తనే గార్డియన్ కాలమ్‌లో సంతకం పెట్టింది. ఆ తర్వాత సంవత్సరంనుంచి తల్లి అని సంతకాలు చేస్తూ వచ్చింది."

"అయితే ఆ పిల్ల తండ్రి ఎవరంటావు?"

"నందకుమార్ మాత్రం కాదు."

"మరి ఎవరు?"

"పదేళ్ళ క్రితం ఆ పాప పుట్టింది. అంటే సిరిదేవి

నాటకాలు వేసి పొట్ట పోషించుకుంటూ వుండే రోజుల్లో పుట్టింది. ఆమె తండ్రి యెవరో అంతుబట్టలేదు. ఎవరో ఘరానా పెద్దమనిషిగాని, తోటి నటుడుగాని ఆమెను పెళ్ళి చేసుకుంటానని మోసం చేసి వుండొచ్చు.”

తల వూపాడు కమీషనర్.

“నందకుమార్ నుంచి ఏమీ సమాచారం దొరకలేదు. పైగా సిరిదేవిని హత్య చేశారనడానికి ఆధారం యేమిటి అంటాడు.”

నవ్వాడు కమీషనర్. “ఆత్మహత్య చేసుకుంటే లెటర్ రాసిపెట్టి వుండేది. తన ఆస్తి యెవరికి చెందాలో విల్లు రాసివుండేది కదా!”

“నేను అదంతా చెప్పలేదు. సమయం వచ్చినప్పుడు బైటపెడతానని దాటవేశాను. నందకుమార్ని అనుమానించడానికి ఆస్కారం లేదా?”

కమీషనర్ నవ్వి “అనుమానితుల జాబితాలో అతన్నీ ఎంటర్ చెయ్యి. అసలైన హంతకుడు దొరికే వరకూ అందరూ అనుమానితులే కదా!” అన్నాడు.

తల వూపాడు కృష్ణమూర్తి.

తర్వాత రిసీవర్ యెత్తి ఏదో నెంబర్ డైల్ చేశాడు కృష్ణమూర్తి.

“ఎవరికి?”

“అర్జునరాజు అని జరలిస్టు వున్నాడు. అతనితో మాట్లాడాలి.”

“హల్లో....” అన్నాడు అవతల ఎవరో ఫోన్ ఎత్తిన శబ్దం విని.

“ఎవరు కావాలి?”

"అర్జునరాజు."

"ప్లీజ్ బీ ఆన్ ది లైన్."

కాసేపటికి అర్జునరాజు గొంతు వినిపించింది.

"హల్లో మిష్టర్ అర్జునరాజు! నేను కృష్ణమూర్తిని మాట్లాడుతున్నాను."

"ప్రొడక్షన్ కృష్ణమూర్తా?"

"కాదు భాయ్! ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి ని."

"ఆఁ....గుర్తొచ్చారు. ఎనీ న్యూస్."

"దాన్ని గురించి కాదు. ఒక ముఖ్యమైన సమాచారం కావాలి. సిరిదేవి పర్సనల్."

"అడగండి."

"ఆమె ఎవర్నయినా పెళ్ళి చేసుకోబోతున్నదని గాసిప్ న్యూస్ ఏదైనా వచ్చిందా ఫీల్డులో!"

"జ్యోతికుమార్ అని ఈ మధ్య కొత్త హీరో వచ్చాడు. అతనితో యెక్కువగా మూవ్ అవుతుందనీ, బహుశా అతన్ని పెళ్ళి చేసుకోవచ్చనీ 'మంట' అనే పత్రికలో గాసిప్ వార్తల్లో వుంది. కాని ఆమెను నేనీ విషయం ఇంటర్వ్యూలో అడగలేదు."

"ఏం?"

"ఇటువంటివి వాళ్ళు చెప్తేనే అథార్టీగా వుంటుంది. గాసిప్ వార్తలు విని అడిగితే బాధపడొచ్చు. అందు కని నేను ఇటువంటివి పట్టించుకోను. అవునూ! ఎందుకు ఇవన్నీ అడుగుతున్నారు?"

"ఊరికినే!" అని నవ్వి "ఉంటాను భాయ్!" ఫోన్ పెట్టేశాడు.

"సార్! నేను అనుమానించినట్టే జరిగింది. సిరిదేవి, జ్యోతికుమార్ అనే హీరోని పెళ్ళి చేసుకోవచ్చునని

'మంట' అనే పత్రిక రాసిందట" అన్నాడు కృష్ణ మూర్తి.

తల వూపాడు కమీషనర్.

"పవన్‌కుమార్ కోసం మనం వెంటనే ప్రయత్నించాలి."

"ఎస్. అన్ని స్టేషన్స్‌కీ రేడియో మెసేజెస్ పంపించాలి. ఎక్కడున్నా అరెస్టుచేసి సిటీకి పంపించమని అర్డర్స్ పంపుతాను."

"అలాగే సార్!" అని సెల్యూట్ చేసి సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు కృష్ణమూర్తి.

## 8

"సార్! మిమ్మల్ని కలుసుకోవడానికి సెంట్రల్ సిటీ ఎమ్మెల్యే మునిరత్నంగారు వచ్చారు" అన్నాడు జవాను పోలీస్ కమీషనర్‌తో.

"రమ్మను."

మునిర్నం ఎమ్మెల్యే ఛాంబర్‌లోకి వచ్చాడు. పరస్పర గౌరవాభివందనాలు అయ్యాయి.

"ఏమిటి యిలా వచ్చారు? మీరు వచ్చారంటే యేదో విశేషమే వుంటుంది" నవ్వాడు కమీషనర్.

"మామూలే. మా వీధిలోనే వుంటున్నాడు కుర్రాడు పవన్‌కుమార్ అని, అతన్ని సినీస్టార్ మర్డర్ కేసులో అరెస్టు చేశారట గదా!"

"అవును."

"పాపం అతను అమాయకుడు. అతని భార్య, మామగారు వచ్చి నా దగ్గర ఏడుస్తున్నారు—ఎలాగైనా వదిలించమని."

"మేము కేస్ పెట్టబోతున్నాము అతని మీద. మీరు

కోర్టులో బెయిల్ తీసుకోవాల్సిందే."

"అంతమాట అనకండి. అతను నిరపరాధి."

"అలా చెప్పకండి. అతను కేసులో యిన్వాల్వ్ అయ్యాడు. మా యిన్వెస్టిగేషన్‌లో ఆధారాలు దొరికాయి."

"భలేవారే మీరు. అతనికి లాభం ఏమిటి ఆ సినీ స్టార్‌ని చంపితే?"

"ఆ సంగతి మాకు తెలుసు. కొన్ని లక్షల బ్లాక్ మనీ ఆమె ఎక్కడో దాచింది. ఆ రహస్యం అతనికి తెలుసు. అందుకే తెలివిగా మర్డర్ చేశాడు. కొంతకాలానికి ఆ డబ్బంతా అతనికి దక్కుతుంది."

మునిరత్నం తల పట్టుకున్నాడు.

"ఏమో! మీరు యిలా చెప్తారు. వాళ్ళేమో వుద్యోగం పోయి మేము యేడుస్తుంటే మా మీద కేసులు పెట్టి పోలీసులు హింసపెడుతున్నారని గొడవ చేస్తున్నారు."

"ఎవరి గొడవ వాళ్ళది" నవ్వాడు కమీషనర్.

"ఇంతకీ అతన్ని విడిచే మార్గం లేదా?"

"చెప్పానుగా. కోర్టులోనే."

"ఏదైనా ఆలోచించండి. మీరు తల్చుకుంటే వాళ్ళకి సహాయం చెయ్యగలరు."

"హంతకులకు ఎవరు సహాయం చేస్తారు చెప్పండి?"

"అతను హంతకుడని మీరు ఎలా రుజువు చేస్తారు చెప్పండి."

"మీరు భలేవారే. మాకుండే ఆధారాలు మాకున్నాయి. అవన్నీ కోర్టులో చూపిస్తాను. మీరు ప్లీడర్ని పెట్టుకోమని వాళ్ళకి చెప్పండి."

"ప్లీడర్ని పెట్టుకోక తప్పదనుకోండి."

"మీరు ఏమీ అనుకోకపోతే ఒక ప్రశ్న?"

మునిరత్నం నవ్వి "అయ్యో అడగండి" అన్నాడు.

"ఈ కేసులో మీకు ఇంట్రెస్టు ఏమిటి?"

"అయ్యో! నా కేమి ఇంట్రెస్టు? వాళ్ళు మా వీధిలో వాళ్ళు. వచ్చి కాళ్ళమీద పడి ఏడుస్తుంటే మంచీ చెడ్డా కనుక్కుందామని వచ్చాను. అంతే. మీకు వీలుంటే సహాయం చెయ్యండి. లేదా? లేదు...." కొంచెం నిష్ఠూరంగానే అన్నాడు మునిరత్నం.

"నిరపరాధి అయితే తప్పకుండా సహాయం చేస్తాను...."

"థాంక్స్!" అని వెళ్ళిపోయాడు మునిరత్నం.

ఎమ్మెల్యే వెళ్ళిన కాసేపటికి వచ్చాడు యిన్స్పెక్టర్ కృష్ణమూర్తి.

"ఎమ్మెల్యే వచ్చి వెళ్ళాడు చూశావుగా! మునిరత్నం అని సెంట్రల్ సిటీ ఎమ్మెల్యే!"

"ఆఁ....కారులో ఎక్కుతుంటే చూశాను సార్! పవన్ కుమార్ గురించేగా!"

"ఆఁ....కోర్టులో బెయిల్ తీసుకోమని చెప్పాను. నిష్ఠూరంగా మాట్లాడి పోయాడు."

"ఇది ఇంతటితో ఆగదు. ఏ మినిష్టరో ఫోన్ చేస్తాడు చూడండి."

"అది మామూలేగా. తన లెవల్లో కాకపోతే మినిష్టర్స్ పలుకుబడి వుపయోగిస్తారు."

## 9

పోలీస్ కమీషనర్ ఆఫీసులో ఫోన్ రింగయింది.

"హల్లో.... నేను అరుణాచలాన్ని మాట్లాడుతు

న్నాను."

"ఎవరు కావాలి మీకు?"

"ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి."

కృష్ణమూర్తి ఫోన్ అందుకున్నాడు.

"హల్లో! ప్రొడ్యూసర్ గారూ బాగున్నారా?"

"ఏం బాగో లెండి. చావు తప్పి కన్ను లొట్టపోయి నట్లుంది మా పరిస్థితి."

"ఏమిటి విశేషం?"

"విశేషమే. సిరిదేవి గురించి ఒక విషయం తెలిసింది. మీకు చెప్పాలని ఫోన్ చేశాను."

"వెరీగుడ్! చెప్పండి."

"ఆ రోజు. అదే ఆమె లాస్టు షూటింగ్ పూర్తి చేసి కారు డ్రైవ్ చేసుకొంటూ వెళ్ళిపోయిందని చెప్పాను చూశారా?"

"ఎస్."

"ఆ రోజు సాయంకాలం బీచ్‌కి వెళ్ళిందట."

"ఎవరు చెప్పారు మీకు?"

"మురళి అని మా ప్రొడక్షన్‌లో అసిస్టెంట్. ఆ రోజు చీకటిపడ్డాక అతను యెవరో ఫ్రెండ్‌తో బీచ్‌కి వెళ్ళాడట. జనం యెవరూ లేని చోట........అంటే సరివి గుబుర్లలో సిరిదేవి యెవరో మరొకరితో కూర్చుని వుందట."

"వెరీగుడ్! మురళిని ఒకసారి మా ఆఫీసుకి పంపుతారా ప్లీజ్!"

"తప్పకుండా! ఆటోలో పంపుతాను. ఎర్ర చారల షర్టు వేసుకుని వున్నాడు మురళి. పొట్టిగా, ఎర్రగా వుంటాడు. మీ ఆఫీసు ముందు దిగగానే గుర్తు

పట్టొచ్చు."

"థాంక్స్!"

రిసీవర్ పెట్టేసి కూర్చున్నాడు కృష్ణమూర్తి.

అరగంట తర్వాత వచ్చాడు మురళి.

అతను కుర్రాడే. పాతికేళ్ళ లోపు వుంటాయి.

జవాన్ తీసుకొచ్చి కృష్ణమూర్తిని చూపించాడు. అతను వస్తూనే నమస్కారం చేశాడు.

"నీ పేరేనా మురళి?"

"అవును సార్!"

"ఎక్కడ పని చేస్తున్నావు?"

"అరుణాచలం క్రియేటర్స్‌లో ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా వున్నాను ప్రస్తుతం."

"ఇప్పుడు చెప్పు. సిరిదేవిని బీచ్‌లో చూసింది గురువారం సాయంకాలమేనా?"

"అవును సార్!"

"ఎలా గుర్తుంది నీకు?"

"బాగా గుర్తుసార్! షూటింగ్ అయిపోయాక ఇంటికెళ్ళాను సార్! మా ప్రక్కింటి అమ్మాయి విమల బీచ్‌కి వెళ్దామని అడిగింది. సరేనని బయల్దేరాను."

"విమల ఎవరు? నీ గర్ల్ ఫ్రెండా?"

"అవును సార్! ఆ రోజు వాళ్ళన్నకి నైట్ డ్యూటీ. ఆరింటికే భోజనం చేసి వెళ్ళిపోయాడు. సినిమాకి వెళ్తున్నానని వాళ్ళ వదినకి చెప్పి నాతో షికారుకి వచ్చింది."

"అది మామూలే నన్నమాట...." నవ్వాడు కృష్ణమూర్తి.

మురళి సిగ్గుపడ్డాడు.

"ఆఁ.... చెప్పు."

"బీచ్‌లో చాలా దూరం నడిచి వెళ్ళాం సార్! ఆ రోజు వెన్నెల. ఒక పొదచాటున సిరిదేవిని గుర్తు పట్టాను సార్!"

"ఆమెతో పాటు వున్న ఆతను ఎవరు?"

"ఎవరో సార్! నే నెప్పుడూ చూళ్ళేదు."

"ఎలా వున్నాడు?"

"కొంచెం లావుగానే వున్నాడు సార్."

"ఊఁ...."

"మీసాలు వున్నాయి."

"పెద్దవా? చిన్నవా?"

"చిన్నవే సార్!"

"ఊఁ...."

"బ్లాక్ ఫ్రేమ్ కళ్ళద్దాలు వున్నాయి సార్!"

"కూలింగ్ గ్లాసెస్."

"కాదు సార్, తెల్లగానే వున్నాయి."

"ఊఁ....తర్వాత."

"అతనికి ఎంత వుంటుంది వయస్సు?"

"ముప్పై ఏళ్ళు వుండొచ్చు సార్."

"అతన్ని గుర్తుపట్టడానికి మొండి గుర్తు యేమిటో చెప్పు?"

మురళి తల గోక్కున్నాడు.

"వెన్నెల్లో చూశాను సార్! మొండి గుర్తులు చెప్ప లేను."

"పోనీ అతన్ని మళ్ళీ చూస్తే గుర్తుపట్టగలవా?"

"తప్పకుండా గుర్తుపడతాను సార్!"

"ఊఁ....తర్వాత. వాళ్ళముందు సీసాలు గ్లాసులు

వంటివి ఏవైనా వున్నాయా?"

"వాళ్ళు ఎర్రటి దుప్పటిమీద కూర్చున్నారు సార్! ప్లాస్టిక్ బుట్ట వున్నట్టు గుర్తు సార్! నేను అవన్నీ గమనించలేదు" అన్నాడు మురళి.

మురళి స్టేట్‌మెంట్ రికార్డు చేశాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

## 10

సిరిదేవి భవనం పూర్తిగా సోదా చెయ్యడం జరిగింది. మెటల్ డిటెక్టర్‌తో మొత్తం గోడలన్నీ చూశారు, ఏదైనా రహస్యమైన లాకర్ వుందేమోనని. ఎక్కడా యేమీ దొరకలేదు.

కాని ఆమె ఐరన్ సేఫ్‌లో ఒక ప్రముఖ బ్యాంక్ సేఫ్ లాకర్ కీ దొరికింది. బ్యాంక్ వాళ్ళు అది తమ లాకరే అని చెప్పారు. లాకర్ నెంబర్ తెలుసుకొని తెరిచారు.

అందులో డబ్బుగాని, బంగారంగాని దొరకలేదు.

ఒక ఫైల్ దొరికింది.

అందులో చక్రవర్తి సిరిదేవికి రాసిన ప్రేమలేఖలు వున్నాయి. ఇద్దరూ కలిసి దిగిన ఫోటో గూడా వుంది. అందులో సిరిదేవి చాలా సన్నగా వుంది. నాటకాలు వేసే రోజుల్లోది.

ఆ లెటర్సన్నీ చదివితే తేలిన విషయం యేమిటంటే చక్రవర్తి గోపాలపురం జమీందారు కొడుకు. టౌన్‌లో ఒంటరిగా వున్న సిరిదేవిని ప్రేమించాడు. పెళ్ళి చేసుకుంటానని నమ్మించి శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఫలితంగా ఆమె గర్భవతి అయ్యింది. చక్రవర్తి ఆమెకు కనిపించకుండా వెళ్ళిపోయాడు.

సిరిదేవి తన స్నేహితురాలు నర్స్ అయిన శాంతాదేవి యింట్లో రహస్యంగా కొన్నాళ్ళు వుంది. అక్కడే ఆడ పిల్లని కన్నది.

ఆ తర్వాత ఆమె సినిమా రంగంలో ప్రవేశించింది. గ్లామర్ పెరిగి ప్రముఖ నటి కావాలంటే తన గత చరిత్ర రహస్యంగా వుండాలని భావించి కూతుర్ని బెంగుళూరులో కాన్వెంట్ స్కూల్లో జేర్పించింది.

కొన్నాళ్ళకి నందకుమార్‌తో ఆమెకు పెళ్ళయింది.

తర్వాత చక్రవర్తి మళ్ళీ ఆమెకు తారసపడ్డాడు. సంఘంలో గొప్ప స్టేజీలో వున్నాడు అతను. సిటీలో పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు వున్నాయి అతనికి. అతని తండ్రి కాబినెట్ మంత్రివర్గంలో సభ్యుడు.

తను ఆమెను మోసం చెయ్యలేదనీ, అనుకోకుండా తండ్రి విదేశాలకు పంపడంవల్ల వెళ్ళిపోయాననీ, తిరిగి వచ్చాక ఆమె కనిపించలేదనీ చెప్పి నమ్మించాడు.

తిరిగి అతన్ని ప్రేమించసాగింది సిరిదేవి. చక్రవర్తి భార్యకు పిల్లలు లేరు. అందుకే ఆమెకు విడాకులు ఇచ్చి సిరిదేవిని పెళ్ళి చేసుకుంటానని చక్రవర్తి నాటకం ఆడు తున్నాడు.

చక్రవర్తి తనను పెళ్ళిచేసుకుంటాడని ఆమె మొదట్లో నమ్మింది. కాని తర్వాత అనుమానపడింది. అతను ఎప్పుడో రాసిన లౌ లెటర్స్ తనవద్ద వున్నాయనీ, ఒక నెలలోపల తనని పెళ్లి చేసుకోకపోతే అతని పరువు తీస్తాననీ, తద్వారా దేశంలో నాయకుడిగా వున్న అతని తండ్రి పరువు ప్రతిష్టలు మట్టిపాలౌతాయనీ బెదిరించింది.

అందుకే చక్రవర్తి ఆమెకు విస్కీ త్రాగించి స్లీపింగ్

పిల్స్ పొడిచేసి అందులో కలిపాడు. అది ఆమె గమ నించలేదు.

ప్రొడక్షన్ అసిస్టెంట్ మురళి తను ఆ రోజు బీచ్‌లో చూసింది చక్రవర్తేనని నిజం చెప్పాడు.

సిరిదేవి తనను బెదిరించడంవల్ల గత్యంతరంలేక తనే ఆమెకు విస్కీలో స్లీపింగ్ పిల్స్ పొడి చేసి యిచ్చాననీ చక్రవర్తి ఒప్పుకున్నాడు.

బెంగుళూరు కాన్వెంట్‌లో చదువుతున్న రజని తనకి సిరిదేవికి పుట్టినబిడ్డ అని స్టేట్‌మెంట్ ఇచ్చాడు.

దేశంలో పత్రికలకు తాజావార్తగా సిరిదేవి హత్య కేసు ఆ విధంగా మలుపు తిరిగి, కోర్టులో ఫైల్ చేయ బడింది.

—:ఐపోయింది:—